# పత్రికాధిపతులకు తమ పత్రికలో ఏదైనా కొత్త ఆకర్షణ ప్రవేశ పెట్టాలని వుంటుంది.

"విజయరాణి" పత్రికవాళ్ళకు కలిగిన సంకల్పం—గొలుసు నవల. ఈ గొలుసు నవల వ్రాయడానికి వాళ్ళు నలుగురు రచయితల్ని ఎన్నుకున్నారు.

## భూమార్గం

### మధురాంతకం రాజారాం

ఈ నలుగురు రచయితలూ దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో నివసించేవాళ్ళు, నాలుగు వేర్వేరు రకాలుగా వ్రాసేవాళ్ళు. జీవితంలో నమ్మిన ఆదర్శాలను బట్టిగాని, సాహిత్యంలో ఆశించే ప్రయోజనాలను బట్టిగానీ ఒకరితో ఒకరికి పోలికలులేనివాళ్లు గొలుసు నవల వ్రాయడానికి ఏరి కోరి యిలాంటి రచయితల్ని ఎన్నిక చేయడం వల్ల రచనద్వారా పాఠకులకు వీలయినంత వైవిధ్యం అందివ్వా లన్నది పత్రికాధిపతుల ఆశయమని ఎలాంటి మొద్దు బుర్ర కలిగిన వాళ్ళకైనా అర్థమవుతుంది. నాకున్నూ అర్థమయిందనే ఒప్పుకుంటాను.

పత్రికాధిపతి నాకు నవలలో ముగింపు భాగాన్ని కేటాయించారు. ఇలా నిర్ణయించడానికి వెనుక ఆయనకు నాపట్ల ప్రత్యేకమైన అభిమానమో, లేక నమ్మకమో వున్నట్టు ధ్వనించారు. కథలో చివరి పేరాకు నవలలో ముగింపు భాగానికి ఎంతటి ప్రాధాన్యం వుంటుందో మీకు తెలుసు. రచన ప్రయోజనం బయటపడడమైనా, రచన నాలుగు కాలాలపాటు పాఠకుల మనసుకు హత్తుకోవడమైనా ఈ చివరి భాగాలవల్లనే జరుగుతుందని మీకు వేరుగా చెప్పవలసిన పనిలేదు. అవయవాలన్నీ పొంకంగా కుదిరేటట్టు శిల్పి తన శిల్పాన్ని తీర్చి దిద్దుతారు. కానీ చిట్ట చివర కనురెప్పలు తీర్చి, కంటి పాపలు దిద్దినప్పుడే గదా శిల్పానికి, జీవకళ రావడం" అంటూ ఆయన రచయితలోని అహంభావానికికాస్తా గిలిగింతలు పెట్టడానికి ప్రయత్నించాడు. కానీ ఈ మాత్రం పొగడ్తలు ఈ రూపంలో గాక పోయినా వారి వారి కనుగుణమైన వేర్వేరు రూపాల్లో మిగిలిన ముగ్గురు రచయితలకున్నూ ముట్టి వుండవచ్చునన్న వూహ నాస్వాతిశయాన్ని "నార్మల్ టెంపరేచర్" లోనే వుంచగలిగింది.'

పత్రికాధిపతి ఇంకా ఇలా వ్రాశారు – "గొలుసు నవల వ్రాయాలనుకున్న రచయితలందరూ ముందుగా ఒకచోట చేరి, స్థూలంగా ఒక యితివృత్తాన్ని నిర్ణయించుకుని, అందులో ఎవరెవరు ఎంతెంతవరకు వ్రాయాలో కూడబలుక్కోడం పరిపాటి. మనం తలపెట్టిన గొలుసు నవల అలాంటిది కాదు. దీని తైపేవేరు. మొదటి రచయిత కొద్దికొద్దిగా వ్రాసిపంపుతూ వుండడంతో పత్రికలో ప్రచురణ ప్రారంభమైపోతుంది. దీన్ని జాగ్రత్తగా "ఫాలో" అవుతూ వచ్చిన తర్వాత రెండో రచయిత అంచెలంచలుగా తన వంతు భాగాన్ని తాను వ్రాసి పంపుకోవలసి వుంటుంది. చివరిదాకా ఇదే వరస. అందువల్ల వ్రాస్తున్న రచయితకొకడికి తప్పితే (ఈ భూ ప్రపంచంలో) మిగిలిన వాళ్ళకెవరికీ ఈ రచన ఎలా కొనసాగుతుందో ఎప్పుడెప్పుడు ఏయే మలుపులు తిరుగుతుందో తెలిసే అవకాశం వుండదు. ఈ కారణాన్నిబట్టి దీన్ని ఒక సరికొత్త ప్రయోగ విశేషంగా మేము భావిస్తున్నాము...."

ఈ వాక్యాలను చదివిన తర్వాత పత్రికాధిపతిగారు నాపైన మోపిన గురుతర బాధ్యత ఎలాంటిదో నేను గ్రహించగలిగాను.

ఈ గొలుసు నవల వ్రాయడానికి ఉద్దేశించబడ్డ నలుగురిలోనూ మొదటి రచయితే అదృష్టవంతుడు. అతడింకొకరిని 'ఫాలో' కావలసిన అవసరముండదు. ఎలాగో ప్రారంభిస్తాడు. ఏవో కొన్ని పాత్రల్ని సృష్టిస్తాడు. వాటిమధ్య ఏదైనా సమస్యను లేవదీస్తాడు. ఓపినంతవరకూ వ్రాసి, ఎక్కడో ఒకచోట చాలించేస్తాడు. తాంబూలాలివ్వడం అయిపోయిందన్న మాట; ఇక తమాషా చూడడమే ఆయన పని. మిగిలిన వాళ్ళ కలా కుదరదు. జాగ్రత్తగా ఫాలో కావడం అటుంచి, ఒకరి పొలాన్ని ఒకరు పైరుచేసినట్టుగా, ఒకరు కని పారవేసిన బిడ్డల్ని యింకొకరు సాకినట్టుగా వీళ్ళు కథారథాన్ని మరి కొంత దూరం ముందుకు లాక్కుపోవాలి. ఈ దృష్ట్యా చూస్తే వీళ్ళు ఒకరికంటే ఒకరు ఎక్కువ దురదృష్టవంతులు.

రోటిలో తలదూర్చిన తర్వాత రోకటి పోటుకు వెరవని మకురుతనం ఒకటి నా కాదినుంచికద్దు. ఏమౌతుందో చూద్దాం లెమ్మని మొండికెత్తి కూచున్నాను.


పత్రికలో నవల ప్రచురింపబడడం ప్రారంభమైంది. ఆ కాగితాల నన్నింటినీ చించి పదిలంగాదాచిపెట్టుకోసాగాను. పరీక్షకు తయారయ్యే విద్యార్థిలా శ్రద్ధగా చదువుకో సాగాను. ఈలోగా నాలుగైదు సంచికలు వచ్చేసరికి నవలను గురించి పాఠకులు వ్రాసిన ఉత్తరాలు కూడా ప్రచురణ కాసాగాయి. "శబభేది' అంటూ ఒక బాణం వుంటుందిట; అది ఎంత చీకటి రాత్రిలోనైనా శబ్దం వినవచ్చిన వైపుకు దూసుకునివెళ్ళి లక్ష్యాన్ని భేదిస్తుందట; పాఠకుల అభినందన లేఖల్ని బట్టిచూస్తే గొలుసు నవల ప్రారంభ దశలోనే అంత పనీ చేయగలిగిందని నాకర్థమైపోయింది. ఎటొచ్చీ నవల చదువుతున్నకొద్దీ

నా గుండెలో మాత్రం రైళ్ళు పరుగెత్త సాగాయి. అంతెందుకు?" అది బొంబాయి నగరంలోని పెద్ద హోటలు అన్న మొదటి వాక్యంలోనే నాకు మతిపోయింది. దేశ పటంలో నేను బొంబాయి ఎక్కడుందో చూపెట్టగలను. అది ఒక రాష్ట్రానికి ముఖ్యపట్టణమనీ, పెద్ద ఓడరేవు అనీ, అక్కడ ఏవేవో కర్మాగారాలు వున్నాయని చెప్పగలను. కానీ ఈ మాత్రపు పరిజ్ఞానంతో నేను నా కథను బొంబాయిలో ఎలా నడిపించగలను? ఇంకా నయం! ఇందాకా పెద్ద హోటలని చెప్పానే, అది ఫైవ్‌స్టార్ హోటలట! దీని విషయంలో నా పరిజ్ఞానం మరీ అన్యాయం. అయిదు నక్షత్రాల హోటలని తర్జుమా చేయడం తప్పితే నేను దీన్ని గురించి యింకొక మాటయినా చెప్పలేను. నవల నడుస్తున్న ధోరణి చూడగా చూడగా నేను నా అజ్ఞానాన్ని బయటపెట్టుకోడానికే ఈ పని ఒప్పుకున్నానేమో నన్న భయం ఒకటి నన్ను పట్టుకుని పీడించడం మొదలు పెట్టింది.


రచనా విషయికంగా ఏ వైనా యిబ్బందులు ఎదురైనప్పుడు మా జానకితో చెప్పుకోవడం నా కలవాటు. ఏలయినంత సత్వరంగా నా సమస్యల్ని పరిష్కరించడం ఆమె చేతనౌను. పెన్ వ్రాయడంలేదంటాననుకోండి. ఒక్క బొట్టయినా క్రిందపడకుండా ఆమె కలాన్ని సిరాతో నింపిపెట్టగలదు. కాగితాలు లేవంటాననుకోండి. వెంటనే ఓ పొరుగింటి కుర్రవాణ్ని బజారుకు పంపి కాగితాలు తెప్పించగలదు. గొలుసు నవలను గురించి నా సందేహాలు వినగానే ఆమె ఫక్కున నవ్వేసింది. "అయ్యో, రాతా! ఏమిటండి, మీరు మరీను! బొంబాయి కైతే వెళ్ళలేను సరే. మీరు మన చిత్తూరు చూడలేదా? తిరుపతి చూడలేదా? మదనపల్లి కూడా వెళ్ళొచ్చారు గదా! బొంబాయి ఇంకాస్త పెదదనుకోలేరూ? మరింక ఆ ఫైవ్‌స్టార్ హోటల్ మాత్రమేముంది? ఏ సినిమాకు వెళ్ళినా అందులో ఒక హోటల్ చూపిస్తారుగదా! ఆడా మగా కలసి....ఆ గౌన్లు, గ్లాసులు, డ్యాన్సులు, బ్యాండు మేళాలు అవన్నీ కలిసి వర్ణిస్తే సరిపోదూ?"-ఓ క్షణం ఆగి ఆమె వున్నట్టుండి యింకొక గడ్డు సందేహాన్నే బయటపెట్టింది- "ఏమండీ, ఇంతకూ అది తెలుగువాళ్ళ కథేనా?"

"ఇంతవరకూ యిందులో తేలిన పాత్రలు రెండే జానకీ! ఆవిడ పేరేమో లీలా కిరణ్. అతని పేరు జీవన్. పేర్లను బట్టి చూస్తే వాళ్ళు తెలుగువాళ్ళనుకోడానికి మనసొప్పడంలేదు" అన్నాను.

"భలేవారండీ మీరు! ఎంతసేపైనా సుబ్బులూ, రాజేశ్వరీ, రామ్మూర్తి, వెంకటావు అనే అనుకోవాలా? ఎంతగా తెలుగు వాళ్ళయితే మట్టుకూ కొంచెం మంచి పేర్లు పెట్టుకో కూడదా? మీది మరీ ఛాదస్తం లెండి...."



గొలుసు నవల విషయంలో మాకు మా జానకి తోడ్పాటుకూడా లభ్యంకాదని తేలిపోయింది. ఈ అవాంతరాన్ని నేను నిస్సహాయంగానే ఎదుర్కోక తప్పదని గుర్తించాను. నా ముళ్ళపైన నేనే నడవాలన్న నిర్ణయానికి వచ్చాను. అయితే ఈ హఠం కొద్ది వారాలు మాత్రమే కొనసాగింది. ఇంపితంకాని తినుబండారాన్ని దిగమింగవలసివచ్చినప్పుడు, ఒక్క పెట్టున పైకెగదన్ని, డోకొచ్చినట్టుగా ఒక ముహూర్తాన నా మనసులోని కల్లోలమంతా బయటపడిపోయింది.



వాలు కుర్చీలో పడుకుని అదే పనిగా రెండుమూడు గంటలవరకూ ఆలోచిస్తూ వుండిపోయిన తర్వాత వంటింట్లో ఏదో పనిమీదవున్న మా ఆవిడను కేకేసి పిలిచి, "లాభంలేదు జానకీ ! నేను గొలుసు నవల వ్రాసే ప్రయత్నాన్ని విరమిస్తున్నాను. ఎడిటరుగారికీరోజే రాసేస్తున్నాను" అన్నాను.

'హవ్వ హవ్వ' అన్నట్టుగా పెదవులకు ప్రేళ్ళనడ్డంగా పెట్టుకుని "అయ్యో ! అదేమిటండీ ! ఇంకేమైనా వుందీ ? నామోషీ గదూ ! ఫలానా పెద్దమనిషి ఇలా చేశారని పత్రికలో వేయకపోయినా పది మందితోనూ చెప్పుకోరూ...."

'ఏం చెయ్యను జానకీ ! నా అశక్తతను మన్నించవలసిందనీ, దయచేసి ఈ విషయానికి ప్రచారం యివ్వొద్దనీ కూడా రాసేస్తాను" అన్నాను దీనంగా.

జానకి కొద్ది క్షణాలపాటు నావైపు అయోమయంగా చూసింది. తరువాత తటాలున ఓ గాద్రెజ్ కుర్చీ తీసుకొచ్చి దానిపైన దిట్టంగా పద్మాసనం వేసుకుని కూచుంటూ "ఇక కానివ్వండి" అన్నట్టుగా ఉపక్రమించింది.

"కాదండీ. ఇప్పుడిందులో మీ కొచ్చిన చిక్కేమిటంటాను? ఇతరు లెవరో ప్రారంభించి కొంతవరకు సాగించిన పనిని మనం కొనసాగించకూడదన్న పట్టింపు మీ కున్నట్టయితే అది వేరే సంగతి. కారణమదైతే మీరాదిలోనే ఈ పని కొప్పుకోకుండా వుండవలసింది. లేదు – ఇప్పుడేమైంది ? పెళ్ళికొప్పుకుని తాంబూలాలు పుచ్చేసుకున్నాక ఈ సంబంధం నాకిష్టం లేదంటే ఎవరొప్పుకుంటారు? నవ్విపోరూ? పోనీ; యిదేమైనా రాజ్యాలేలే పనా? పెట్టుబడి పెట్టి పెద్ద బిజినెస్సేమైనా చేస్తున్నారా? ఏం లేదే : కథ రాయడమేగదా, భేషుగ్గా రాయొచ్చు ...."

వాలు కుర్చీ ఆమెకు దగ్గరగా జరుపుకుంటూ అసలు సంగతేమీ నాకంతుబట్టినట్టులేదు జానకీ ! నీకో విషయం చెప్పనా?" అన్నాను.

చెప్పడానికి పర్మిషన్ యిస్తున్నట్టుగా జానకి కళ్ళు గుండ్రంగా త్రిప్పింది.

"జీవన్ అనే యువకుడు, లీలా కిరణ్ అనే యువతీ ఒక పెద్ద హోటల్లో కలిశారు గదా! ఈ లీలా కిరణ్ అనే అమ్మాయి ఏవో చెప్పరాని బాధలతో సతమతమైపోతున్నట్టు జీవన్ గ్రహిస్తాడు. ఇంతవరకూ జరిగిన వ్యక్తిత్వ చిత్రణనుబట్టి జీవన్ అలాంటి వాళ్ళకు తోడ్పడ్డమే జీవితాదర్శంగా కలిగిన వాడని మనం భావించవచ్చు. సచ్చజెప్పి అతడామెను తన నివాసానికి తీసుకెళ్తాడు. ఓ మూడంతస్తుల కట్టడం పై భాగంలో అతడి నివాసం. నాలుగైదు గదులున్న పెద్దవాటాలో అతడు ఒంటరిగా నివసిస్తూ వుండడం వల్ల కథకేకాదు. ఆ అమ్మాయికి కూడా లేనిపోని కాంప్లికేషన్స్ ఎదురయ్యే ప్రమాదం తప్పింది. ఎలాగయినా ఆ అబ్బాయి కూడా గడసరివాడే! ఏమిటో జరగబోతుందని వేచి చూస్తున్న పాఠకుల్ని ఉత్కంఠతో ఉక్కిరిబిక్కిరి చేసేస్తూ ఏమీ జరగకుండా జాగ్రత్తపడుతున్నాడు. మొదట మొదట లోపల పదిలంగా గడియపెట్టుకునిగానీ నిశ్చింతగా నిద్రపోలేని ఆ అమ్మాయి కూడా ఇప్పుడిప్పుడు గడియవేయకపోయినా కొంపమునిగిపోయే ప్రమాదమేమీ లేదన్న అవగాహనకు వచ్చేసింది. వాళ్ళీ మకాముకొచ్చి నాలుగైదురోజులయినట్టుందిచిత్రమేమిటంటే ఇంతవరకూ ఒక్కసారైనా మేడపైనుంచి క్రిందికి దిగినట్టులేదు. భౌతిక ప్రపంచంలో కేవలం గాలి మాత్రమే భోంచేసి నిక్షేపంగా బ్రతకడం మానవమాత్రుల తరంకాదు. కానీ ఈ నవలలో హీరో. హీరోయిన్లు మట్టుకూ అచ్చంగా అలాగే బ్రతుకుతున్నారు. ప్రస్తుతం వాళ్ళు మకాం చేసివున్న మేడపైన పొయ్యిగానీ.స్టౌగానీ కుంపటిగానీ వున్నాయనుకోడానికి ఆధారం లేదు. కారియర్లో అన్నం తెప్పించుకున్న జాడకూడాలేదు. ఈ జీవన్ అనే అబ్బాయి ఎవరోగాని మాట్లాడే తీరునుబట్టి అతనొక తెలుగావిడ కన్నబిడ్డలాగే వున్నాడు. లీలా కిరణ్ కూడా అంతే ! అయితే, అతడు ఒంటరిగా బొంబాయిలోని ఒక ఏకాంత గృహంలో ఎందుకు కాలం గడుపుతున్నాడో అర్థంకాదు. ఈ లీలాకిరణ్ అనే అమ్మాయి హఠాత్తుగా బొంబాయి నగ

# బీడీలు - బేడీలు

చలిగా వుంది, ఆకలిగా వుంది బాబూ!
వేడికోసం బీడీ కాల్చుకుంటాను బాబూ!

మీరు సగం కాల్చిన బీడీ ఇలా పారేయండి
మంచులో తడిసిన నన్ను రోడ్డుమీద ఆరేయండి

యెముకల్ని కొరుకుతోంది బాబూ చలి
ఈ చలికంటే నయం ఆ అడివిలో పులి

గొప్పోళ్ళు యేందేంటో చెబుతున్నారు మా గురించి
చెప్పేది చేసేదిలేదు—అదే పేచీ

యెండకాలంలో గుడిసె కాలిపోయింది
వానకాలంలో కుక్కిమంచం కొట్టుకుపోయింది

గొంగళి దొంగలెత్తుకుపోయారు చీకటిలో
ఇంగలం లేదు బాబూ! నెగడేసుకోడానికి చలిలో

యెవడో తప్పుపనిచేస్తే నాకు బేడీలేశారు
ఇమ్మని అడిగితే మీరు బీడీ నీళ్ళలో పారేశారు

చల్లటి పొగమంచు కళ్ళనిండా కమ్ముకుంది
వెచ్చటి పొగని నా ఊపిరి కోరుతోంది

నిప్పు

—డాక్టర్ దాశరథి

రంలో వూడిపడడం ఎలా జరిగిందో బోధపడదు. అతడు సిగరెట్లు కాల్చుకుంటూ వుంటాడు. ఆమె ఆకాశం వైపు చూస్తూ వుంటుంది. అతడు రేడియో ఆన్ చేస్తాడు. ప్రేమగీతం వినిపించే సరికి ఆమె చరాలున గదిలోకి వెళ్ళిపోతుంది. అతడు తాను చదివిన ఒక గొప్ప నవలను గురించి చెబుతూ అందులోని ప్రేమ వ్యవహారాన్ని ప్రస్తావిస్తాడు. "హరి హరి" అని చెవులు మూసుకోదుగానీ, ఆమె చిరాకుతో ముఖం చిట్లించుకుంటుంది. తల నొప్పిగా వుందంటూ గదిలోకి వెళ్తుంది. ఇష్టంగా నైతేనేమి, అయిష్టంగా నైతేనేమి. వాళ్ళు ప్రేమనే భోంచేసి బ్రతుకుతున్నారన్నది సారాంశం! ఎండలు కాసె భూమండలంలో యిలాంటి విడ్డూరం జరగవచ్చునని నేను కలలోనైనా అనుకున్నవాణ్ణిగాను. నేను నా ఊహకందిన విషయాలను, నా హేతువాద శక్తికి లోబడిన విషయాలను గురించి మాత్రమే రాస్తూ వచ్చానని నీకు తెలుసు, వింటున్నావా జానకీ! "ఊహాతీత విషయాలను గురించి మీ అవివేకం కాస్త ప్రదర్శించండి, నాకు చూడాలని మక్కువగావుంది" అంటూ నువ్వు నన్ను బలవంత పెట్టడం భావ్యం కాదు" అంటూ నేను బతిమాలుకున్నాను.

"ఏమండీ! మునుపటికెవరో పెద్దమనిషి అల్లగాడికైతే అన్నం ఆకులో పెడుదువుగానీ, నారుమాత్రం నేలపైనే పెట్టమన్నాడట! కాకపోతే కథజరిగినకొద్దీ ఆ అబ్బాయి బొంబాయిలో ఎందుకుంటున్నాడో. ఆ అమ్మాయికి ప్రేమంటే ఎందుకు ముఖంమొత్తిందో తెలియకపోతుందా? పోతే అయిదారు రోజులనుంచీ వాళ్ళు బొత్తిగా పచ్చిమంచి నీళ్ళయినా ముట్టలేదంటున్నారు. అది మాత్రం పాయింటే! బహుశా రచయిత మరచిపోయివుండొచ్చు. లేదంటే పశు పక్ష్యాదులు కూడా ఏదో ఒక తిండి తినే బ్రతుకుతున్నాయిగదా, హీరో, హీరోయిన్ల విషయంలో దానికంత ప్రాధాన్యం యివ్వడమెందుకని భావించివుండొచ్చు! మీకెందుకు, మీరూరుకోండి! మీదాకా వచ్చేసరికి సమస్యలన్నీ వాటంతటవే విడిపోకపోతే అప్పుడు నన్నడగండి!" అంటూ మా ఆవిడ చక్కా వంటింటివైపు వెళ్ళిపోయింది.

ఏమైనా జరగబోయే కథను వూహించడంలో మా జానకి గొప్ప ఎక్స్‌పర్ట్ అని ఒప్పుకోక తప్పలేదు. నవలలో తనవంతు భాగాన్ని తాను ముగించడానికి ముందుగా రచయిత నా సందేహాలు కొన్నింటికి అరటి పండు వలిచి నోట పెట్టినంత సులభంగా సమాధానాలు చెప్పేశాడు.

తెలుగుదేశం నడిబొడ్డున వున్న పెద్ద జమీందారీ గ్రామం శ్రీమన్నారాయణపురం. ఆ వూరి జమిందారుగారి ఏకైక సంతానం జీవన్. చిన్నప్పుడే తల్లి దండ్రు లిద్దరూ పోయారు. బెనారస్‌లో చదువుకుంటూవుండి చదువు పూర్తయ్యాక జీవన్ యింటికి తిరిగి వచ్చాడు. దివాణంలో తిష్టవేసి ఇష్టారాజ్యంగా జమీందారీ ఆదాయాన్ని మేస్తున్న మేనమామలు, మేనత్త మొగుళ్ళు, వేలువిడిచిన బావలు ఎవరికి వారే తమ కూతుర్ని జీవన్‌కు కట్టబెట్టి, అక్కడ తమ ఆధిపత్యాన్ని స్థిరపరచుకోవాలన్న చదరంగంలో ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారు. ఆ పోరు పడలేక ఎక్కడికి వెళ్తున్నదీ చెప్పకుండా జీవన్ బొంబాయికి పారిపోయి వచ్చేశాడు.

జీవన్ స్థితిగతులేమిటో తెలిశాయిగదా! ఇక పేరును బట్టిగానీ, ప్రవర్తనను బట్టిగానీ లీలాకిరణ్ కూడా బాగా కలవారి బిడ్డేనని అనుకుంటే పాఠకుడు డింకీ కొట్టవలసిందే!

# దీపావళి పిండివంటలు

## డోనట్స్

**కావలసిన పదార్థాలు :**

మైదా - రెండు కప్పులు, వెన్న - కప్పు, పాలు - కప్పు, చక్కెర - కప్పు.

చిక్కని పాలలో చక్కెర వేసి ఒక చెంచాతో బాగా కొట్టాలి. కొట్టిన తరువాత వెన్న వేసి మరల బాగా కొట్టాలి. మైదా కొంచెము కొంచెము వేస్తూ కలపాలి. దీనిలో చిటికెడు బేకింగ్ పౌడరు (లేక) అమోనియా వేసి కలపాలి. ఈ పిండి కలిపేటప్పుడు తడి కాకూడదు. ఈ పిండి రెండు గంటలు నానాలి. నానిన తరువాత బాగా మర్దించి చపాతీల కంటె మందముగా వత్తాలి. మనకు కావలసిన ఆకారంలో ముక్కలుగ కోసుకోవలెను. ఈ ముక్కలు డాల్డాలోగాని.నూనెలోగాని వేసి దోరగా వేయించుకోవలెను. కాస్త శ్రమ అనిపించినా తినటానికి చాలా రుచిగా వుంటాయి.

## అయినాసు


**కావలసినవి :**

మైదాపిండి : 1 కే.జి, బియ్యంపిండి : ½ కె.జి, నెయ్యి : ¼ కే.జి. పంచదార : 1 కే.జి, మిఠాయిరంగు : చిటికెడు, ఉప్పు : 1 టేబుల్ స్పూను.

బియ్యం పిండి, మైదా పిండి, ఉప్పు, మిఠాయి రంగులో తగుమాత్రం నీరుపోసి చపాతీ పిండిమాదిరి వుండలా కలపాలి. ఆ తరువాత నెయ్యితో పూరీల మాదిరి వత్తాలి. వీటిని మనకు నచ్చిన ఆకారంలో కోసి, నేతిలో వేయించాలి. ఆ తరువాత వెడల్పాటి కళాయి గిన్నెలో పంచదారను పాకం పట్టాలి. తీగపాకం వచ్చిన తరువాత వేయించిన ముక్కలను వేసి, కొంచెంసేపు నాననివ్వాలి. ఆ తరువాత వీటిని తింటే ఎంతో బాగుంటాయి.

—కె. సీత

తాలూకాఫీసు శిరస్తాదారుగారి మూడో కూతురు లీలాకిరణ్. శిరస్తాదారు రిటయిరై పోయారు. ఆయన స్వార్జితం పెద్దమ్మాయిల కిద్దరికీ పెళ్ళిళ్ళు చెయ్యడంతోనే కరిగిపోయింది. తండ్రి ఇంగితాన్ని గుర్తించినట్టుగా లీలా కిరణ్ కాలేజీలో చదువుతూ వుండగానే ఓ అబ్బాయిని ప్రేమించింది. ఆ ప్రేమించడంకూడా ముందూ వెనకా చూడకుండా ప్రాణాధికంగానే ప్రేమించేసింది. కాని ఏం లాభం? పెద్ద కట్నాన్ని ఎరగాజూపి ఇంకొక అమ్మాయి ఆ అబ్బాయిని ఎగరేసుక పోయింది. భూగోళం బద్దలయినట్టుగా, మిన్ను విరిగి తలపైన పడ్డట్టుగా తల క్రిందులై పోయిన లీలా కిరణ్‌కు, పులి





మీద పుట్రలా మరొక ఇక్కట్టు ఎదురైంది. ఉన్న ఇంటిని తెగనమ్మి అయినాసరే, ఆమె కెలాగో పెళ్ళి చేసేయ్యడానికి తండ్రి ఉద్యుక్తుడై పోయాడు. ఈ గండం లోనుంచీ బయటపడ్డం కోసం ఆమె ఇంటి దగ్గర మాయమై బొంబాయిలో తేలింది. తన స్నేహితురాలొకతె క్లబ్బులో డ్యాన్సు చేస్తూ బ్రతుకుతూ వుందని తెలిసి, ఆమె తనకేదైనా ఉద్యోగం చూపెడుతుందేమోనన్న ఆశతో హోటల్లోకి వచ్చిన లీలా కిరణ్, అక్కడ తన స్నేహితురాలికి బదులుగా జీవన్‌ను కలుసుకోగలిగింది.

ఔరా ఇదా సంగతి — అనుకో గలగడంతో ఊపిరి త్రిప్పుకోడానికి వీలయింది.

అయినా ఆపదలనేవి చెప్పి రావు గదా? వేటగాడి బారినుంచి తప్పించుకుని వచ్చిన జింకపిల్లతో వ్యవహరించినంత సున్నితంగానే లీలాకిరణ్‌తో వ్యవహరిస్తున్న జీవన్ ఓ దుర్ముహూర్తంలో ఆమె దగ్గర పెళ్ళి ప్రసక్తి తీసుకొచ్చేశాడు. అంతటితో ఆమె 'ఛీ, ఈ మగవాళ్ళంతా యింతే' నని క్రుద్ధురాలై పోయి పెట్టె సర్దుకుని, జీవన్‌కు తెలియకుండా ఆ యింటి నుంచి వెలుపలికి వచ్చేసింది.

అంతటితో నవలలో మొదటి భాగం పూర్తయింది. పైవారం నుంచీ రెండో రచయిత రచన ప్రారంభం కానున్నదని పత్రికలో ప్రకటన కానవచ్చింది.

మొదటి రచయిత హఠాత్తుగానూ, అర్థాంతరంగానూ వదిలిపెట్టిన కథను అందిపుచ్చుకోడంలో రెండో రచయిత బాగా తికమక పడిపోయి వుంటాడనిపించింది. ఇప్పటివరకూ నవలలో తేలినవల్లా రెండే పాత్రలు. తనదాకా వచ్చేసరికి అందులో ఒకటి చేజారిపోయింది. పెనుబీడులా, ఒంటిచెట్టులా జీవన్ ఒక్కడు మాత్రమే మిగిలాడు. ఏం చేయడానికి తోచక ఆ చెట్టు చుట్టూ గిరికీలు తిరిగినట్టుగా రచయిత కథానాయకుడి వియోగ దుఃఖాన్ని వర్ణించాడు. చెట్టెక్కి శాఖాచంక్రమణం చేసినట్టుగా అతనిగత జీవిత విశేషాలను జ్ఞాపకాలను ఏకరువుపెట్టాడు. చెట్టు నీడలో పల్టీలు కొట్టినట్టు అతణ్ని ఆయన




వూళ్ళన్నీ తిప్పించాడు. లీలా కిరణ్ స్వగ్రామానికి వెళ్ళి వాకబు చేస్తే, వాళ్ళ నాన్నగారు తీర్థయాత్రలకు వెళ్ళిపోయి నట్టు తెలుస్తుంది. ఇంతకుమించి ఆమె ఉనికిని గురించి తెలుసుకునే వెరవేదీ స్ఫురించక జీవన్ హతాశుడై పోతాడు. ఆమెను మరచిపోవడానికని అతడు చేసిన ప్రయత్నాలన్నీ వమ్మయిపోతాయి. ఈ దశలో ఒకహఠాత్సంఘటనజరిగిపోతుంది. అదేమిటంటే ఒకానొక విచిత్ర పరిస్థితిలో లీలాకిరణ్ జీవన్‌కు తారసిల్లడం; ఫైళ్ళు చేత బట్టుకుని ఒకానొక ఆఫీసు నుంచి బయటికొచ్చి ఆమె బస్సుకోసం వేచి చూస్తోంది. అతడు పరుగు పరుగునా ఆమె ఎదుటికి వెళ్ళి నిలబడిపోతాడు. "ఏమండీ; ఇక్కడున్నారా? ఏం చేస్తున్నారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తాడు. అయితే లీలా కిరణ్ మాత్రం తన జీవిత కాలంలో తానెప్పుడూ అతణ్ణి చూసి ఎరుగ నట్టు తెల్లబోతుంది. అది నిజమో, అభి నయమో అంతుబట్టక జీవన్ నిర్విణ్ణుడవు తాడు. నిరాశతోను, నిస్పృహతోనూ కృంగిపోతూ అతడు తన జమిందారీకి తిరిగి వెళ్ళిపోతాడు.

జీవన్ తన స్వస్థలానికి తిరిగి వచ్చాడు. నవలలో రెండో భాగం ముగిసింది.

ఇంక నా పాట్లు ప్రారంభం కావడానికి పది పన్నెండు వారాలకన్నా ఎక్కువ వ్యవధి లేదు.

ఆ మూడో రచయిత గనుక ఈ కథను తీసుకెళ్ళి ఓ వ్యాస ఘట్టంలో వదిలి పెట్టేశా డంటే ఆ పైన నేను చిక్కి చిక్కరించ వలసిన దుస్థితిలో మాత్రమే వుంటాను.

చేతులు కాలక మునుపే ఆకులు పట్టు కోడం మంచిది. ఈ లోగా ఎలాగైనా ఈ గండగత్తరలో నుంచి బయటపడే ఉపాయం కనిపెట్టాలి.

ఒకటి రెండు రోజు లదేపనిగా ఆలో చించాను.

బుర్రలో మెరుపు మెరిసిందంటారుగదా. మెరుపు కాకపోయినా అలాంటిదేదో జరి గింది.

ఊరెళ్ళొస్తానని మా ఆవిడతో చెప్పి రైలెక్కినవాణ్ణి, వెళ్ళి వెళ్ళి రెండువందల మైళ్ళ దూరంలో వున్న ఓ పట్నంలో దిగాను.

అదే మూడో రచయిత నివసించేవూరు.

ఆయన యింటినికూడా సులభంగానే వెదికి పట్టుకోగలిగాను.

కామేశంగారితో నాకు ముఖ పరిచయం లేకపోయినా, కొస్త ఉత్తరాల పరిచయం వుంది. పేరు చెప్పుకోగానే కుర్చీ చూపెట్టి కాఫీ ఇప్పించి, సముచితమైన ఆతిథ్య మర్యాదలన్నీ చేశాడు. లాంఛనాలన్నీ ముగిసిన తర్వాత "ఇంత దూరం ఏం పనిమీద వచ్చారండీ? ఇక్కడేమైనా సాహిత్య సభ జరుగుతోందా?" అని ప్రశ్నించాడు. లేదన్నాను. "ఈ వైపున మీకెవరైనా బంధువులున్నారా?" అన్నాడు. "అబ్బే లేరండీ;" అన్నాను. ఆ వూరికి దగ్గరగా వున్న ఓ క్షేత్రం పేరు చెప్పి "అక్కడికి యాత్రార్థమేమైనా వచ్చారా;" అన్నాడు. 'అబ్బే, అదీ కాదండీ;' అన్నాను. 'మరి.... మరి....' అంటూ ఆయన నా వైపు అయోమయంగా చూసేసరికి, యిక చెప్పుకోకతప్పింది కాదు. "మీ కోసమే వచ్చానండీ;" అనే సరికి ఆయన 'నా కోసమా, నా కోసమా' అంటూ ఆశ్చర్యపడిపోయాడు.

నేను వెళ్ళిన పనిని గురించి ఆయనతో నింపాదిగానే మనవి చేసుకున్నాను.

"కామేశంగారూ? ఆదిలోనే నేను మీ కొక మాట చెప్పుకోవాలి. ఈ యిలాతలం పైన యింతవరకు ఒక రచయిత యింకొక రచయితను యిలాంటి పనిమీద వెదుక్కుంటూ వచ్చివుండడని మాత్రం నేను ఘంటాపథంగా చెప్పగలను. ఇది చాలా సున్నితమైన వ్యవహారమని మాత్రం నేను ఒప్పుకుంటాను. పూర్తిగా విన్నతర్వాత మీరైనా నా అభిప్రాయంతో ఏకీభవించక

రోజు రోజుకు అధిక కొనుగోలుతో ప్రోత్స హించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక స్థానమును కలిగించిన మా అభిమానులకు, శ్రేయోభి లాషులకు 'దీపావళి' శుభసమయాన

మా శుభాకాంక్షలు

KANTA CHAP

బొంబే డైయింగ్ షోరూమ్

శ్రీ లక్ష్మి

కొత్తగూడెం.

పోరన్న నమ్మకం నాకుంది. మీకు తెలిసిన విషయమే; నేను సమాజంలో మధ్యతరగతికి చెందినవాణ్ణి. పెద్దగా స్థితి గతులు లేనివాణ్ణి. మంచికో, చెడ్డకో నేనొక రచయితనై పోయాను. పాతికేళ్ళనుంచి ఏవో రచనలు చేస్తున్నాను. వ్రాయడం చేతనౌను గదా అని నేను అణువునుంచీ బ్రహ్మాండం వరకు ఎన్నెన్ని వస్తువులైతే వున్నాయో అన్నింటిని గురించి వ్రాయడం సాధ్యమేనన్న దురహంకారానికి పోలేదు. నా పరిమితికి హద్దులేవో గుర్తించి. నా అనుభవానికి లోబడిన విషయాలను గురించి మాత్రమే వ్రాస్తూ వచ్చాను. మరైతే యిప్పుడీ గొలుసు నవల నడుస్తున్న తీరు నన్ను బాగా కలవరపెడుతోంది. ఈ ఆపదలోంచి నన్నెలాగైనా మీరే గట్టెక్కించాలి...."


నా అభ్యర్థనలోని అంతరార్థం కామేశం గారికి బోధపడినట్టులేదు. "అయ్యా! మీరు చెప్పదలచుకున్నదేమిటో సూటిగా చెప్పకూడదా బాబూ?" అన్నాడాయన.

పచ్చిపులుసు
వెంకట సన్నయ్య
అండ్ సన్స్

ప్రొప్రయిటర్:
పి. వి. సుబ్రమణ్యము
అండ్ సన్స్

మెయిన్‌రోడ్డు,
విశాఖపట్టణము-1.

ఆయుర్వేద మందులు, కర్పూర జరీదండలు, సురాకారము, గంధకము వగైరా అమ్మబడును.



"చూడండి కామేశంగారూ! నాకు పూరిపాకల్లో మనుషులెలా బ్రతుకుతున్నారో తెలుసు. పెంకుటిళ్ళల్లో జీవితం ఎలా సాగుతోందో తెలుసు. మిద్దెల్లోని జీవనసరళి ఎలా వుంటుందో కూడా తెలుసు. కానీ మేడలు, బంగళాలు, ప్రాసాదాలు మొదలైన వాటిని గురించి ఏమీ తెలియదు. పోర్టికో అంటారుగదా, బాల్కనీ అంటారు గదా అవి మేడకు ముందువైపున వుంటాయో, వెనుకవైపున వుంటాయో నేను చెప్పలేను. మ్యూజియంలో వస్తువుల్ని చూసినట్టుగా రోడ్డుమీద వెళ్తూ, నేనలాంటి కట్టడాల నెన్నింటినో చూసి ఉన్నాను. కానీ వాటిలో నివసించేవాళ్ళు ఉపయోగించే ఫర్నిచర్‌ను గురించిగాని, తినే తిండిని గురించిగానీ, పాటించే ఆచార వ్యవహారాలను గురించిగాని నాకు కాస్తంత పరిజ్ఞానమైనా లేదు. జీవించడమెలాగన్న సమస్యతో పోరాడుతూ సతమతమౌతున్న వాళ్ళని గురించి నేను వ్రాయగలను. జీవించడానికి కావలసిన స్థితిగతులు, శక్తియుక్తులు వుండికూడా ఏవో లేనిపోని సమస్యల్ని సృష్టించుకుని, త్రాగలేక పాలు బోర్లపోసుకునేవాళ్ళని గురించి వ్రాయడం నా చేతగాదు."

కామేశంగారు తల పంకిస్తూ కూర్చున్నవైఖరి చూస్తే, ఆయన కీసారి నా ఆంతర్యం అర్థమైనట్లే తోచింది.

కానీ ఎంతసేపు వెదికి చూసినా ఆ గడసరి మనిషిలో అంతకు మించిన రెస్పాన్సు మాత్రం కానరావడం లేదు.

"ఎందుకొనమైతేనేమి, యింత దూరం దాకా వచ్చారు. రెండు పూటలుండి మా ఆతిథ్యం పుచ్చుకునే వెళ్ళండి" అంటూ ఆయన నన్ను మొగమాటపెట్టేశారు.

ఆశాభావానికి తావిచ్చే మాట ఏదీ ఆయన నోటంట రాకపోవడం మాత్రం నా కొక కొరతగానే వుండిపోయింది.

స్టేషనుదాకా వచ్చి ఆయన నన్ను రైలెక్కించాడు. రైలు కదలబోతుండగా "మేష్టరుగారూ! మీరు మీకొచ్చిన ఇబ్బంది ఏమిటో నా చెవిలో వేశారు. నేనర్థం చేసుకున్నాను. ఇంక మీరు బెంగపడనక్కర్లేదు. నిశ్చింతగా వుండండి" అంటూ అభయహస్తం చాపి, వీడ్కోలిచ్చేశాడు.

"బ్రతుకు జీవుడా" అనుకుంటూ తిరుగుదారి పట్టాను.

* * *

ప్రతి వ్యక్తి జీవితంలోనూ దీపంపెట్టి తలుచుకో వలసిన వాళ్ళు కొందరుంటారు గదండీ! కామేశంగారు నాకు చేసిన మేలు అంతకు తక్కువైనదేమీ కాదు.

తిండి ఎక్కువైన కొద్దీ శరీరంలో కొవ్వు చేరినట్టుగా, డబ్బు ఎక్కువైన కొద్దీ మనిషి నొక మాంద్య స్థితి ఆవహించేటట్టుగా తోస్తుంది. దుమ్ము దులిపినట్టుగా

ఆ మాంద్యాన్ని వదలగొట్టి జీవన్ అనే యువకుణ్ణి ఆయన ఒక మామూలు మని షిగా చేయగలిగాడు.

ఈ పరిణామం ఏర్పడేలోగా నవల కొన్ని మలుపులు తిరగవలసివచ్చింది.

జీవన్‌బాబు తండ్రి పెద్ద జమిందారు. తన హయాంలో జమిందారీపైన ఓ పిసనిగ్ర అప్పులు చేసి పెట్టాడు. ఆయన తదనం తరం వచ్చిన ఆదాయమంతా ఆశ్రితుల దుబారా ఖర్చులకే సరిపోయింది. చాలని దానికి దివాణంలో ఉద్యోగులు పంది కొక్కుల్లా తయారై ఎవరిచేతికి దొరికిన సొత్తును వాళ్ళు సంగ్రహించారు. నిద్ర పోని వడ్డీలు పాపంలా పెరిగి పెరిగి పెరిగి అసలు కన్నా ఎక్కువ మొత్తమై కూచుని ఆస్తి పాస్తులన్నీ తెగనమ్మినా ఇంకా అప్పులు మిగిలిపోయే దుర్దశ దాపురించింది. స్వగ్రామం చేరుకున్న జీవన్‌బాబుకు ఎదు రైన పరిస్థితి ఇది.

కోర్టుకు వెళ్ళి ఏవైనా అడ్డు సవాళ్ళు వేస్తే ఆస్తిలో కొంతైనా మిగిలించు కోవచ్చునని లాయర్లు కొందరు సలహా ఇచ్చారు. కానీ అలాంటి నామర్దా పని చేయడానికి మనసొప్పక జీవన్‌బాబు తన సర్వస్వాన్ని అప్పులకే దఖలుపరచి తాను కట్టుగుడ్డలతో మిగిలిపోయాడు.

ఎంతో కాలంగా దివాణం పైనబడి దోచుక తిన్న దగ్గరి బంధువులెవరూ ఇప్పుడు తనకు ఆశ్రయమిచ్చే సదుద్దేశంతో లేరని అతడు గ్రహించడానికి మరికొంత కాలం పట్టింది.

పువ్వులమ్మిన వూళ్ళో కట్టెలమ్ముకో డానికి మనస్కరించక జీవన్‌బాబు వున్న వూరినుంచి ఎటో వెళ్ళిపోతాడు.

నవలలో మూడో భాగం ముగిసింది.

రస్తా సుగమంగా చేసిపెట్టినందు వల్ల తటపటాయించకుండా ముందుకు దూసుకెళ్ళే వెసులుబాటు నాకు చేజిక్కింది. ఒకప్పటి పనిలేని కులాసా జీవితానికిన్నీ యిప్పటి నిరుద్యోగి వేదన కున్నూ వున్న తేడా ఏమిటో జీవన్ ద్వారా నిరూపించడానికి వీలయింది. అను కోని అతిథిలా పూట పూటకూ ఎదుటకు వచ్చే నిండైన విస్తరిని అలక్ష్యంచేయడం మట్టుకే తెలిసిన వాడికి తిండి ఆవశ్యకత ఏమిటో తెలియజెప్పడానికి వీలైంది. అజీర్తివల్ల మాత్రమే ఎప్పుడైనా ఉపవాస మున్నవాడికి ఆకటిబాధ ఎలా వుంటుందో రుచి చూపించ డానికి వీలయింది. బొంబా యిలో లంకంత ఏకాంత గృహంలో ఒంట రిగా కాలం వెళ్ళబుచ్చినవాడికి ఈ దేశంలో ఎందరో మనుషులు చెట్లక్రింద, బ్రిడ్జీల క్రింద, పేవ్‌మెంట్లమీద జీవిస్తున్నారని తెలియజేయడానికి వీలయింది. మేడలో పై అంతస్తు కిటికీలోనుంచీ రోడ్డుపైన చీమల్లా దోమల్లా నడయాడుతూ కానవచ్చే జన సమూహాన్ని మాత్రమే చూడ్డానికి అలవాటుపడిన వాడికి వాళ్ళందరూ తన సాటి వాళ్ళేననీ, వాళ్ళల్లో తనూ ఒక్క డనీ నమ్మించడానికి వీలయింది.

ఎడతెగని త్రిప్పటవల్ల జీవన్ ఆరో గ్యం పాడౌతుంది. చికిత్సకోసం ధర్మాసు పత్రిలో చేరవలసివస్తుంది. తానింక ఎంతోకాలం బ్రతకడేమోనన్న అను మానం కలిగిన సంకట పరిస్థితిలో చివరి కోరికగా తననొకసారి కలుసుకోవలసి సిందిగా అర్థిస్తూ అతడు లీలాకిరణ్‌కు ఓ ఉత్తరం రాసి పడేస్తాడు.

ఆరోగ్యం కుదిరినమీదట వాళ్ళిద్దరికి దేవా లయంలో ఆ శుభకార్యం కాస్తా అయిందని పించుకుని ఒక చిన్న పెంకుటింట్లో కొత్తగా కాపురం ప్రారంభిస్తారు.

జీవన్‌కు రెవిన్యూ డిపార్టుమెంటులో గుమాస్తా నౌకరీ దొరుకుతుంది.

ఉదయం తొమ్మిది గంటలకు భోజనం చేసి, మధ్యాహ్నానికి చిన్న కారియర్లో టిఫిన్ తీసుకెళ్ళి, అయిదింటివరకు నడుము పైకెత్తకుండా పనిచేసి ఆపైన అతడు ఆఫీసునుంచి బయటికొస్తాడు. వస్తూ, వస్తూ మార్కెట్టు దగ్గర ఆగి పావలా యిచ్చి పూలు పొట్లం కట్టించుకుంటాడు. వాలు కుర్చీలో సోలిపోయిన భర్తకు భార్య వేడివేడిగా కాఫీ యిస్తుంది. వంట పని పూర్తయ్యాక యిద్దరూ పార్కుదాకా షికారు. వంట త్వరగా పూర్తయితే ఏకంగా సినిమాకే వెళ్తారు. హంసతూలికా తల్పమంటే అదెలా గుంటుందోగానీ, పెరట్లో ఆరుబయట మల్లెపందిరి దాపున మంచం వేసుకున్నా హాయిగానే వుంటుంది. మాట్లాడుకుంటూ మాట్లాడుకుంటూ వాళ్ళు నిద్రలోకి జారిపోతారు. తెల్లవారు జామున చలిగా వున్నట్టుతోస్తే వున్న ఒకటే దుప్ప టిలోకి వెచ్చగా ఒళ్ళు ముడుచుకుని పొంది కగా పడుకుంటారు.

ఉండి వుండి ఎప్పుడైనా జీవన్‌బాబు "అరరే, ఈ బ్రతుకే బాగుందే!" అను కోడం కద్దు.

* * *

నవల పూర్తయింది. అయితే నవలనిలా ముగించి నందుకు మా ఆవిడ నన్నెంతగా తిట్టి పోసిందో చెప్పలేను. పాఠకులెంతగా ఆగ్రహపరవశులై వుంటారో, పత్రికాధి పతికి ఎంతటి ఆశాభంగం కలిగి వుంటుందో అదీ చెప్పలేను. నా కెదురైన పరిస్థితిని అనుభవజ్ఞులైన వారు ఎవరికివారే ఊహించుకోగలరు. ★



ఆదరాభిమానముతో అహర్నిశలు మమ్మల్ని ఉత్తేజపరచే
మా శ్రేయోభిలాషులకు
'దీపావళి' పర్వదినాన
మా శుభాకాంక్షలు
VIMAL
A RELIANCE PRODUCT
'ఆరాధన' విమల్ షోరూం
కొత్తగూడెం.